గోశాలలో పర్యావరణహిత రాఖీలు



గోవుల రోమాలతో తయారు చేసిన రాఖీలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఏడో డివిజన్ టేకులపల్లి శ్రీ వెంకటేశ్వర గోశాలలో రాఖీని పురస్కరించుకొని ప్రత్యేక రాఖీలు తయారు చేస్తున్నారు. గోవుల రోమాలతో సహజ సిద్ధంగా ఈ రాఖీలు తయారు చేయడం విశేషం. ఈ రాఖీలు పర్యావరణహితంగా ఉండటమే కాకుండా గోమాత పట్ల భక్తి భావాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు చెబుతున్నారు. వీటిని కొనుగోలు చేసి ఆమొత్తం గోవుల గ్రాసానికి ఉపయోగపడే విధంగా రాఖీ జరుపుకోవాలని నిర్వాహకులు ప్రధానార్చకులు ఆరుట్ల శ్రీనివాసచార్యులు కోరుతున్నారు.

అంగన్‌వాడీలో రాఖీ..



చిన్నారులకు రాఖీ కడుతున్న టీచర్ గీత

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ పిల్లలకు రాఖీలు కట్టి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ గీత కేంద్రంలోని పిల్లలకు రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు.

రాఖీ సందడి..

- సోదరులకు రాఖీ కట్టేందుకు అక్కాచెల్లెళ్లు సిద్ధం
- పయనమైన సోదరీమణులు
- రాఖీలు, స్వీట్లకు గిరాకీ

నేడు రక్షాబంధన్



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రాఖీలు..

ఖమ్మంగాంధీచౌక్: ఓ వైపు శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు, పూజలతో హడావుడి చేసిన మహిళలు శనివారం రాఖీపౌర్ణమి సందర్భంగా సోదరులకు రాఖీ కట్టేందుకు అంతా సమాయత్తమయ్యారు. వరలక్ష్మీ వ్రతాలు, రాఖీ వేడుకలతో ప్రతి ఇంటా సందడి నెలకొంది. రాఖీ అంటే రక్షణ బంధం. ఇది అన్నాచెల్లెల్లు, అక్కాదమ్ముళ్లు జరుపుకునే మహోత్తరమైన పండుగ. అక్కా లేదా చెల్లి తన అన్నయ్య లేదా తమ్ముడు ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ కట్టేది ఈ రాఖీ. శ్రావణపౌర్ణమి రోజున ఈ వేడుకను జరుపుకోవటం ఆనవాయితీ. ఈ మేరకు రాఖీ సంబురాలు శ్రావణ శుక్రవారం నుంచే ప్రారంభించారు. ప్రతీ ఇంటా వరలక్ష్మీ వ్రతాలు, పూజలతో పాటు రాఖీ పండగ సందడి నెలకొంది. శ్రావణ పౌర్ణమి రోజున ఎన్ని ఆచారాలున్నా రక్షాబంధానానికే తొలి ప్రాధాన్యం ఉంటుంది. కులమతాలు పట్టింపు ఉండదు. బీదా గొప్పా అన్న బేధం.. వయసుతో సంబంధం లేదు. రాఖీ వచ్చిందంటే దేశమంతా సోదరమయంగా మారిపోతుంది. నువ్వు చల్లగా ఉండాలి సోదరా అంటూ ఆడవాళ్లు రాఖీ కడితే నేనున్నాను నీకు అన్నగా రక్షణగా అని మగవారు ధీమా అందిస్తారు. రాఖీ పౌర్ణమి ఉదయాన్నే లేచి తలంటు స్నానం చేసి కొత్త వస్త్రాలు ధరించి సోదరి ఎదురుగా కూర్చొని రాఖీ కట్టించుకుంటారు. తన సోదరునికి సకల విజయాలు సిద్ధించాలని ఆశిస్తూ హారతినిచ్చి నుదుట తిలకాన్ని దిద్ది తీపిని తినిపిస్తారు. ఇందుకు బదులుగా సోదరులు మనస్ఫూర్తిగా సోదరీమనులకు బహుమతులు ఇచ్చి దీవెనలు అందిస్తారు. రాఖీ వేడుకను శనివారం జరుపుకునేందుకు అక్కాచెల్లెళ్ల హడావుడి ప్రారంభమైంది.

జోరుగా విక్రయాలు..

రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రకాలను బట్టి ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. రూ.10లు మొదలు రకాలను రూ. 200 ఆ పైన ధరలతో కూడా రాఖీల ధరలు ఉన్నాయి. చిన్నారుల అభిరుచి మేరకు కార్టున్ బొమ్మలతో రాఖీలు సైతం ఉన్నాయి. అంతేగాక ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న వారు వెండి, బంగారంతో కూడిన రాఖీలను కూడా కొందరు తయారీ చేయించుకున్నారు. నగరంలో ఎక్కడ చూసినా రోడ్ల వెంట రాఖీల స్టాళ్లు దర్శనమిస్తున్నాయి.

స్వీట్లకూ గిరాకే..

రాఖీలను కట్టి వారు ఉన్నతంగా ఉండాలని కోరుకుంటూ స్వీట్లను తినిపిస్తారు. దీంతో రాఖీలతో పాటు స్వీట్లకు కూడా గిరాకీ పెరిగింది. కొందరు రాఖీలతో పాటు స్వీట్లను విక్రయిస్తున్నారు. అక్కడే కొనుగోలుదారులు రెండు కొంటున్నారు. కొందరు రాఖీలను కొనుగోలు చేసి స్వీట్ల దుకాణాలకు వెళ్లి తమకు ఇష్టమైన స్వీట్లను కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా స్వీట్ల దుకాణాల యజమానులు రకాన్ని బట్టి డిమాండ్ ఉన్న రకాలకు ధరలను పెంచి విక్రయిస్తున్నారు.





రాఖీ స్టాళ్లలో సందడి..

రాఖీలు కట్టేందుకు పయనం

దూరప్రాంతాల్లో ఉన్న అక్కాచెల్లెల్లు, తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టేందుకు వెళ్తున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారు బస్సుల్లో, రైళ్లలో బయలుదేరి వెళ్తున్నారు. ఇక అన్నదమ్ముళ్లకు రాఖీలు కడితే ఆ సోదరులు తమ అక్కాచెల్లెల్లు ఆనందంగా ఉండాలని కోరుకుంటూ వారికి కట్నకానుకలు సమర్పిస్తారు. కొందరు అక్కాచెల్లెల్లకు ఇష్టమైన వస్తువులను కొనిస్తారు. కొందరు బట్టలు పెట్టి ఆనదింపజేస్తారు. తమ స్థోమతకు తగిన విధంగా తమ అక్కాచెల్లెల్లను ఆనందపరుస్తారు. తమ అక్కాచెల్లెళ్లు కట్టిన రాఖీలను చూసుకొని మురిసిపోతారు.

నానో ఎరువులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సతీష్

తిరుమలాయపాలెం: నానో ఎరువుల వాడకంతో పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని కూసుమంచి ఎడిఎ మిట్టపల్లి సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుబ్లేడు గ్రామంలో నానో యూరియా, డీఏపీపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ద్రవరూపంలో ఉన్న నానో ఎరువులతో రైతులకు శ్రమ, ఖర్చు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మొక్కలకు భూమి నుండి ఐరన్ పోషకాన్ని గ్రహించే శక్తి పెరుగుతుందని, మొక్కల పెరుగుదలలో ఉపయోగపడుతుందని, కలుపు నివారణ కూడా జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నానో ఎరువులను వరి పొలంలో స్ప్రే చేయించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ నారెడ్డి సీతారాంరెడ్డి, ఏఈఓ బాలకృష్ణ రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం



పాదయాత్ర చేస్తున్న నాయకులు

కామేపల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ముచ్చర్ల నుంచి ఏన్కూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని శుక్రవారం లాల్యతండా నుంచి కెప్టెన్‌బంజర క్రాస్ రోడ్డు వరకు పార్టీ ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముచ్చర్ల–ఏన్కూర్ ప్రధాన రహదారి దెబ్బతిని గుంతలమయంగా మారి నిత్యం ఎంతో మంది ప్రయాణికులు ప్రమాదబారిన పడుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తూ పలుమార్లు వినతి పత్రం అందించిన పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, కొండబోయిన నాగేశ్వరరావు, కృష్ణ, సుధాకర్, నరేందర్, వింజం నాగభూషణం, బాదావత్ శ్రీను, కిన్నెర రామచంద్రయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

కార్మికులకు సమగ్ర చట్టాలు అవసరం

రఘునాథపాలెం: భూమిలేని పేద కుటుంబాల అభివృద్ధికి, వ్యవసాయ కూలీలకు స్థిరమైన ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టాలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని జింకలతండలో శుక్రవారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం నియోజకవర్గ, రఘునాథపాలెం అర్బన్ మండలాల మహాసభలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేసి, పట్టణాల్లో కూడా అమలు చేయాలని కోరారు. భూమిలేని ప్రతి కూలీకి 'కూలీ బీమా' పేరుతో మరణించిన పక్షంలో రూ.5 లక్షలు అందించే పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌కె.ఇమామ్‌ను డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా, పడిగల నాగేశ్వరరావును కార్యదర్శిగా, మరో 10 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఇమామ్, వెంకన్న, తీగల వెంకటేశ్వరరావు, మీరా, కృష్ణయ్య, నవీన్ రెడ్డి, ఉపేందర్ ఉన్నారు.

రిజర్వేషన్ల అమలుపై ద్వంద్వ వైఖరి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కూసుమంచి: బీసీ రిజర్వేషన్ల అమలుపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం కూసుమంచిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్లను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలుపరుస్తూ తెలంగాణా విషయానికి వచ్చే సరికి కేంద్రం కాలయాపన చేస్తుందన్నారు. రిజర్వేషన్ల సాధనకు ఈనెల 12న మండల కేంద్రంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు మల్లెల సన్మంతరావు, ఎడవెల్లి రమణారెడ్డి, బషీరుద్దీన్, శీలం గురుమూర్తి, బిక్కసాని గంగాధర్, కర్ణబాబు, గన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరి డిప్యూటేషన్ రద్దు..

ఖమ్మంమయూరిసెంటర్: ఇతర మున్సిపాలిటీల నుండి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వర్తించేందుకు డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరి ఉద్యోగుల డిప్యూటేషన్‌ను రద్దు చేసి, తిరిగి ఆ మున్సిపాలిటీలకు పంపిస్తూ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సత్తుపల్లి నుండి శానిటరీ జవాన్ బుర్రి వెంకటేశ్వర్లు, మధిర మున్సిపాలిటీ నుండి బిల్ కలెక్టర్ బుర్రి నాగేశ్వరరావులు కేఎంసీకి డిప్యూటేషన్‌పై వచ్చారు. పలు కారణాలతో వీరి డిప్యూటేషన్లు రద్దు చేసి తిరిగి ఆయా మున్సిపాలిటీలకు పంపించినట్లు తెలిసింది.

చోరీ కేసులు నమోదు

రఘునాథపాలెం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు చోరీలకు సంబంధించి కేసులు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ... రఘునాథపాలెం యాపిల్ సెంటర్‌లోని వెంకన్నకు చెందిన పాన్‌షాప్‌లో రూ.5 వేల విలువైన సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మరో ఘటనలో ఖమ్మం–వైరా ప్రధాన రహదారిపై రెడ్‌చిల్లీస్ హోటల్ సమీపంలో ప్రహరీకి సంబంధించిన (ఫ్రీ కాస్ట్ వాల్స్) టాటా ఏసీ వాహనంలో ఎక్కించుకుని వెళ్తున్న వ్యక్తిని పోలీసులు ప్రశ్నించగా, అవి దొంగతనం చేసినవని తేలింది. ఈ ఘటనపై కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు.

పెన్షనర్ల మహాధర్నాను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 11న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పెన్షనర్ల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని పెన్షనర్ల జేఏసీ సమావేశం కృషిభవన్‌లో ఎస్‌జీపీఏటీ జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెఏసీ నాయకులు పరిశ పుల్లయ్య, రంగారావు, జల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... పెన్షనర్ల బకాయిలు తక్షణం చెల్లించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు రవికుమార్, సోమయ్య, లక్ష్మినారాయణ, తిరపతయ్య, సుధాకర్‌రావు, కృష్ణయ్య, ఉప్పలయ్య, కోట్యాలు పాల్గొన్నారు.

ధర్మస్థలి ఘటనలపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న లతాదేవి

ఖమ్మంమయూరిసెంటర్: కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థలిలో జరిగిన అమానవీయ ఘటనలు, హత్యలపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేపట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ధర్మస్థలి హత్యలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ, ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మతం పేరుతో సుదీర్ఘ కాలం పాటు హత్యలు జరిగాయని ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీని వెనక ఉన్న ఏ స్థాయిలో ఉన్న వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోటు కళావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి, డీవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, నాయకులు సీహెచ్.సీతామహాలక్ష్మి, రామకృష్ణ, మద్దోజు శ్రవణ్, లక్ష్మీనారాయణ, బండి పద్మ, మెరుగు రమణ, లక్ష్మి, లలిత, ఝాన్సీ, వెంకటేష్, యశ్వంత్, చింతల రమేష్, సుభాష్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తా..

ఖమ్మంరూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు నివాసముండే ఆవాస ఏరియాల్లో మౌలిక సదుపాయాలు కల్పన దిశగా ఇక్కడి సమస్యలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మారుతీనగర్‌లో శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు విజయ్, ప్రచార కార్యదర్శి పెరుమాళ్లపల్లి శ్రీనివాసులు, సాయిబాబా, మల్లయ్య, మల్లికార్జున్, పుల్లయ్య, శ్రీదేవి, రాజు, శోభన్, ఏడుగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంఘం జెండావిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: నగర కూరగాయల మార్కెట్ వద్ద ఐఎన్‌టీయూసీ నగర అధ్యక్షుడు నరేష్ మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు కొత్త సీతారాములు, 50వ డివిజన్ కార్పొరేటర్ రాపర్తి శరత్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ... జరగబోయే రిటైల్ మార్కెట్ ఎన్నికల్లో ఫజల్‌తోపాటు అతని ప్యానల్ సభ్యులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వ్యాపారస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ దీపక్ చౌదరి, నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, మిక్కిలినేని నరేంద్ర చౌదరి, జాకీర్ మహమ్మద్, పోతగాని రమణ కుమార్, పాల్వంచ కృష్ణ, సంగయ్య, రవి, సైదులు, కొండం మధు, ఉమారావు, ఆంజనేయులు, రఫీ, ముల్లర్, దశరథ్, పుల్లయ్య, వెంకటేష్, గోపి తదితరులు ఉన్నారు.

42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే..



మాట్లాడుతున్న గుండాల కృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీ కులస్తులకు పాలకులు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని మున్నూరుకాపు సంక్షేమ సంఘం నాయకులు గుండాల కృష్ణ అన్నారు. ఈ మేరకు సంఘం సమావేశం శుక్రవారం కృష్ణ నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్నూరుకాపులు మిగతా బీసీ కులస్తులను కలుపుకుని రిజర్వేషన్ సాధించేలా కృషి చేయాలన్నారు. రాజకీయ పార్టీలు కూడా మున్నూరుకాపులకు సముచిత స్థానాలు కేటాయించాలని, అప్పుడే ఆయా పార్టీలకు మద్దతు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు కొత్తా సీతారాములు, మూలగుండ్ల శ్రీహరి, ఉప్పు మోహన్‌రావు, చౌడవరపు వెంకటేశ్వర్లు, మెంతుల శ్రీశైలం, గీతా వెంకన్న, జనార్ధన్, మాటేటి రామారావు, కనకం భద్రయ్య, మాటేటి నాగేశ్వరరావు, అప్పారావు, తోట శేఖర్, వీరభద్రం, నవీన్, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ గెలుచుకున్న మెకానిక్



బైక్ అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరానికి చెందిన టూ వీలర్ మెకానిక్ బుర్ర పరుశురాం గత నెల 10న క్యాస్ట్రాల్ ఆక్టివ్ ఇంజిన్ ఆయిల్ కూపన్ స్కాన్ చేయగా లక్కీ డ్రాలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్‌ను గెలుచుకున్నాడు. ఈ మేరకు శుక్రవారం ఖమ్మం నగరంలో ఆయిల్ డిస్ట్రిబ్యూటర్ ప్రషీల్, తెలంగాణ మార్కెటింగ్ ఆక్టివిటీ మేనేజర్ సలీం, సేల్స్ మేనేజర్ శివ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శంకరనాథ్, టీం లీడర్ ప్రసాద్ పరుశురాంకు బైక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగాల కొండలరావు, కార్యదర్శి లింగన్నబోయిన మురళి, బల్లి నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లెట్ అన్వర్, ప్రచార కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, తూము సత్యం, ఆవుల ఉపేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూసుమంచి: మరమ్మతుల్లో భాగంగా శనివారం మండలంలోని పాలేరు, చేగొమ్మ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధి కారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పాలేరు, నాయకన్‌గూడెం, హట్యాతండా, వాల్యాతండా, మల్లాయిగూడెం, జుజుల్‌రావుపేట, భోజ్యాతండా, చేగొమ్మ, ముత్యాలగూడెం, కేశ్వాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

నేలకొండపల్లి: తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీయూజేఏసీ జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని నాచేపల్లి గ్రామానికి చెందిన మండడి వెంకటేశ్వరరావును రాష్ట్ర కమిటీ సభ్యులుగా శుక్రవారం నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి నియామకపు పత్రాలను జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులకు స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేసి, ఆరోగ్యకార్డులు, రైలు, బస్సు పాసులను ఉచితంగా అందించాలన్నారు. నాయకులు తీగ రాములు, జి.నాగమణి, బి.నాగేశ్వరరావు, కాకామాను మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంక్ ఆవిర్భావ వేడుకలు



ఆవిర్భావ వేడుకల్లో బ్యాంక్ ఉద్యోగులు, నాయకులు

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల సెంట్రల్ బ్యాంక్‌లో బ్యాంక్ 144వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ బ్యాంక్ వ్యవస్థాపకులు సొరాబ్జీ పోచ్‌ఖానావాలా చిత్రపటానికి, బ్యాంక్ ఉద్యోగులతో కలిసి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ స్వాతి, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీమాన్ అభిషేక్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

కామేపల్లి: గృహ వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలబారిన పడకుండా విద్యుత్ శాఖ ఆధ్వర్యాన శుక్రవారం మండలంలోని కొత్తలింగాల, బర్లగూడెం గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులతో ఏఈ శ్రీనివాసులు మాట్లాడారు.. ఇళ్లలో చాలా మంది బట్టలను ఆరేసేందుకు ఇనుప తీగలను వినియోగిస్తారని, వీటికి విద్యుత్ తీగలు ఆనుకోవడంతో ప్రమాదాలబారిన పడతారని, అలా కాకుండా నైలాన్ దారాలను వినియోగించాలన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ఖమ్మంఅర్బన్: కేఎంసీలోని 8వ డివిజన్ బాలపేటలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొడుగు నాగేశ్వరరావు, కుర్రా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాస్‌లైన్ నాయకుడి మృతిపై సంతాపం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం టేకులపల్లికి చెందిన మాస్‌లైన్ నాయకుడు చింతిరాల నాగయ్య శుక్రవారం మృతి చెందగా పలువురు సంతాపం ప్రకటించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. హమాలీల కూలీ రేట్లు, సమస్యల పరిష్కారంతో పాటు భూపోరాటాల్లో నాగయ్య ముందు నిలిచారని కొనియాడారు. వివిధ పార్టీల నాయకులు గోకినపల్లి వెంకటేశ్వర్లు, నున్నా నాగేశ్వరరావు, మానుకొండ రాధాకిషోర్, పి.బాబురావు, జి.రామయ్య, ఆవుల అశోక్, ఝాన్సీ, కె.శ్రీనివాస్ తదితరులు కూడా ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలి

నేలకొండపల్లి: విద్యుత్ షిఫ్ట్ పనులు యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు సూచించారు. మండలంలోని రాజేశ్వరపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న విద్యుత్ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గంలోని 11 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి మంత్రి శ్రీనివాసరెడ్డి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ కోక్యానాయక్, ఏఈ నారాయణరావు, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, నర్సయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఇళ్లల్లో కొందరు అమ్మవారికి పూజలు చేసుకుని ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. దేవాలయాల్లో కుంకుమపూజలు, వ్రతాల్లో పాల్గొని పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: ద్వారకానగర్‌లో..



వీడీవోస్ కాలనీలో..



కూసుమంచి: పూజ చేస్తున్న మహిళ

నగరంలో సినిమాలు

తిరుమల	కింగ్‌డమ్
వినోద	మహా అవతార్ నర్సింహా
సాయిరాం	బకాసుర రెస్టారెంట్
ఆదిత్య	సు ఫ్రం సో
శ్రీనివాస	అతడు, సయారా (హిందీ)

– ఖమ్మంగాంధీచౌక్